క్లుప్తంగా

నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, తదితర క్రీడలు జరుగుతాయని చెప్పారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న విద్యార్థులు పేర్లు నమోదు చేసుకుని ఆయా పోటీల్లో రాణించాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ రవీంద్రకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి సిగ్గు చేటు



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు ప్రజా సంఘాల నాయకులు

బనగానపల్లె రూరల్: దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థను అవమానించేలా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం దేశానికే సిగ్గు చేటని గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కాలింగిరి రాముడు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పెద్ద మునెయ్య, పలువురు ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎస్సీ వ్యాపార సముదాయాల వద్ద ప్రజాసంఘాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయడం అంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టేనన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్రన్న, వెంకటరాముడు, ఎంఎస్‌టీ అధ్యక్షుడు నాగన్న, ఓబయ్య, బలిజ సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి గురువారం తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లో భక్తులు గత మూడు నెలలుగా వేసిన విరాళాలను లెక్కించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

13న అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13వ తేదీ జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి పలు కంపెనీల్లో అప్రెంటిషిప్ చేయడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ పాసై ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, కుల, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్ట్ ఫొటోలతో పాటు ఒక సెట్టు జిరాక్స్ కాపీలతో స్థానిక ఐటీఐలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శుభకార్యం

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన ఎండీ ఖాసీం కుమార్తె షఫీపుర్, రహిమాన్ వివాహ వేడుకకు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. వధువును ఆశీర్వదించారు. అలాగే ఇటీవల వివాహం జరిగిన భూపనపాడు బాషా కుమార్తె షేక్ సాదాప్, ముల్ల అబ్దుల్ దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

న్యాయ వ్యవస్థపై దాడి చేసినట్లే!

కోవెలకుంట్ల: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని ఖండిస్తూ నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కరీం బాషా కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజ్యాంగంలో స్వయం ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థకు భారత ప్రధాన న్యాయమూర్తి శిరస్సులాండివాడన్నారు. అలాంటి వ్యక్తిపై ఓ న్యాయవాది చెప్పు విసరడం న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా భావించాలన్నారు. ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తాలో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోవెలకుంట్ల: స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రామమోహన్ తెలిపారు. 132/33కేవీ ముదిగేడు సబ్‌స్టేషన్, 33/11కేవీ కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపట్టనున్నామని వెల్లడించారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తారకరామనగర్, అక్షర స్కూల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

కల చెదిరింది

- జగనన్న కాలనీల్లో ఆగిపోయిన ఇంటి నిర్మాణాలు
- రెండేళ్లు కావస్తున్నా మంజూరు కాని బిల్లులు
- నిలిచిపోయిన విద్యుత్, నీటి సరఫరా
- ప్రకటనలకే పరిమితమైన అదనపు సాయం
- కూటమి ప్రభుత్వ వివక్షతో పేదలకు నెరవేరని సొంతింటి కల



డోన్ మండలం ఉడుములపాడు వద్ద జగనన్న కాలనీ



వృథాగా మారిన నీటితొట్టె

డోన్: నియోజకవర్గంలోని జగనన్న కాలనీలు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు గృహనిర్మాణాల కోసం ఏర్పాటు చేసిన ఈ కాలనీలు ఏడాది కాలంగా నిర్లక్ష్యానికి గురై, పిచ్చిమొక్కలు, ముళ్లకంపలతో నిండిపోయి నివాసానికి అనర్హంగా మారుతున్నాయి.

87 లేఅవుట్లు, 9,588 పక్కాగృహాలు

గత ప్రభుత్వం ప్రతి పేదవాడికి గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రారంభించిన 'జగనన్న పక్కా గృహాల'పై ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా నిర్లక్ష్యం చూపుతుండడంతో పేదల సొంతింటి కల అలాగే మిగిలిపోతోంది. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి, బేతంచెర్ల, డోన్ మండలాల పరిధిలోని 87 గ్రామాల్లో జగనన్న కాలనీల లేఅవుట్లు ఏర్పాటుచేసి, మొత్తం 9,588 పక్కాగృహాలకు నిధులు మంజూరు చేసింది. అందులో 5,834 గృహాలను పూర్తి చేసేందుకు లబ్ధిదారులకు రూ.1.80 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. సిమెంట్, ఇనుపకడ్డీలు, కిటికీలు, వాకిళ్లు వంటి నిర్మాణ సామగ్రితో పాటు కూలీల ఖర్చును కూడా ప్రభుత్వం నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమ చేసింది. కాలనీల్లో నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు ఏర్పాటుచేయడంతో పేదలు ఇళ్ల నిర్మాణ పనులు ఉత్సాహంగా ప్రారంభించారు. కానీ, ప్రభుత్వం మారిన తర్వాత ఆ పనులు ఒక్కసారిగా ఆగిపోయి కాలనీలు పాడుబడిపోతున్నాయి.



నిర్వహణ గాలికొదిలేయడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలనీ

అదనపు సహాయం ఏదీ?

జగనన్న కాలనీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇళ్లు పూర్తిచేసుకునేందుకు రూ.50 వేల అదనపు సహాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అందించలేదు. మొండిచేయి చూపడంతో పలువురు లబ్ధిదారులు తమ ఇళ్లను పూర్తిచేసుకోలేక తల్లడిల్లిపోతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడంతో పాటు జగనన్న కాలనీలో నీరు, విద్యుత్ సౌకర్యాలు యథావిధిగా కొనసాగించి ఉంటే పేదల సొంతింటి కల సాకారమై ఉండేది. ఇళ్లు లేని పేదల్లో 99 శాతం మంది గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసుకుని అద్దెల భారాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా లబ్ధిదారుల సంఖ్య

డోన్ అర్బన్	2,333
డోన్ రూరల్	1488
బేతంచెర్ల	2403
ప్యాపిలి	1672
మొత్తం	9558

శిథిలావస్థలో బోర్లు, నీటి ట్యాంకులు



శిథిలావస్థలో బోరు, నిరుపయోగంగా నీటి ట్యాంకు

గత ప్రభుత్వం లబ్ధిదారులు ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని ప్రతి కాలనీలో బోర్లు వేయించి, మోటార్లు, నీళ్ల ట్యాంకులు, తొట్లు నిర్మించింది. నీటిని సరఫరా చేసేందుకు ప్రత్యేక సిబ్బందిని కూడా నియమించింది. దీంతో 60 శాతం ఇళ్లు రికార్డు స్థాయిలో పూర్తయ్యాయి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సిబ్బందిని తొలగించడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. బోర్లు ఎండిపోయి, ట్యాంకులు, తొట్లు శిథిలావస్థకు చేరాయి.

బిల్లులు మంజూరు చేయడం లేదు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులు అత్యంత వేగంగా జరిగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్లక్ష్యం చూపుతోంది. 15 నెలలు కావస్తున్నా పెండింగ్ బిల్లులు మంజూరు చేయడం లేదు. గత ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనని ఇలా వ్యవహరించడం సరికాదు. ప్రస్తుతం కాలనీలోని చాలా ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

–సరిత, లబ్ధిదారురాలు, డోన్

ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం



జగనన్న కాలనీల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు తొలగించేందుకు అధికారులు రూ. 20 వేలు కూడా మంజూరు చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. పేదలకు సెంటు స్థలం మంజూరు చేయకపోగా గత ప్రభుత్వం ప్రారంభించిన కాలనీలోని గృహాలను సైతం ఈ ప్రభుత్వ పూర్తి చేయలేకపోతోంది. ఇప్పటికైనా స్పందించి కాలనీల్లోని గృహాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలి.

–లక్ష్మి, లబ్ధిదారురాలు, డోన్

శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం



డోన్‌లో వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు, ఉపాధ్యాయులు

డోన్ టౌన్: సమాజంలో మూఢనమ్మకాలు పోగొట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్న జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే 'చెకుముకి సంబరాలకు' సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం స్థానిక కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో విడుదల చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు రామమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ నేత నరసింహులు మాట్లాడుతూ.. నాలుగు స్థాయిల్లో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, ప్రశ్నించే తత్వం పెంపొందించడంలో ఈ టెస్టులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సర్వజ్ఞమూర్తి, అబ్దుల్‌లతీఫ్, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, బాబు, రమేష్, గోపాల్, లక్ష్మీనాయక్, అమీర్‌బాషా, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంతో జీవితం ఆనందం



పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

బేతంచెర్ల: మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే జీవితం ఆనందంగా ఉంటుందని జిల్లా కేరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు మౌలాలి, శ్రీరామ్ విద్యార్థులకు సూచించారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, మైండ్ రిలాక్సేషన్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ అబిదా బేగం విద్యార్థులను అభినందించారు.

బాణసంచా గోడౌన్లలో తనిఖీలు



వ్యాపారులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

డోన్ టౌన్: టపాకాయలు విక్రయించే వ్యాపారులు సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. గురువారం ధర్మారం గ్రామ సమీపంలోని జిలెటిన్ స్టిక్స్, బాణసంచా గోడౌన్లను తనిఖీ చేశారు. భద్రతా చర్యలు, స్టాకు, రిజిస్టర్లను పరిశీలించారు. వ్యాపారులకు పలు సూచనలు చేశారు. త్వరలో దీపావళి పండుగ రానున్న నేపథ్యంలో స్టాకు నిల్వలపై ఆరా తీశారు. ఆయనతో పాటు రూరల్ ఎస్ఐ మమత, ఏఎస్ఐ గోపాల్ తదితరులు ఉన్నారు.

స్కూటరిస్టుకు గాయాలు

డోన్ టౌన్: ఆగివున్న బస్సును వెనుక నుంచి ఢీకొనడంతో స్కూటరిస్టుకు గాయాలయ్యాయి. ఈ ఘటన డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన వలి ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం బైక్‌పై డోన్ నుంచి బేతంచెర్లకు వెళుతుండగా ఆగివున్న బస్సును ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స నిమిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.



ఘటనా స్థలంలో క్షతగాత్రుడు వలి

దస్తగిరిస్వామికి పూజలు

డోన్ టౌన్: పట్టణంలోని కేఈ మాదన్న నగర్ ఉన్న దస్తగిరిస్వామి కందూరు కార్యక్రమాన్ని కుల మతాలకు అతీతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దర్గా కట్టను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మేళ తాళాలు, డ్రమ్స్ వాయిద్యాలతో జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. దర్గాలో ఉంచి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న నగర పంచాయతీ కమిషనర్, వైద్యురాలు

బేతంచెర్ల: పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్యురాలు ప్రియాంక ప్రజలకు అవగాహన కల్పించారు. మధ్య తరగతి వారు ఉపయోగించే ద్విచక్ర వాహనాలు, టీవీలు, నిత్యావసర వస్తువులు, రైతులు ఉపయోగించే ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గించారని తెలిపారు. దీని వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.25వేల విరాళం



అర్చకుడికి విరాళం అందజేస్తున్న దాత

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన బ్రీదుల ఆదినారాయణ, సుబ్బమ్మ దంపతుల కుమారుడు బాలాజీ కుటుంబ సభ్యులు గురువారం రూ.25వేల విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ అర్చకుడు పవన్‌కుమార్‌స్వామి అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

అదుపు తప్పితే ప్రమాదమే



గాలేరు-నగరి వరద కాల్వ వద్ద రక్షణ లేని దృశ్యం

అవుకు(కొలిమిగుండ్ల): చెర్లోపల్లె సమీపంలోని గాలేరు–నగరి వరద కాల్వ వద్ద రక్షణ లేకపోవడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. అవుకు రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం ఎక్కువ ఉన్న సమయంలో ఈ వరద కాల్వ ద్వారా వైఎస్సార్ జిల్లా గండికోటకు నీటిని వదులుతుంటారు. ప్రధాన రహదారిని అనుసంధానిస్తూ కాల్వ ఏర్పాటు చేశారు. కాల్వ మీదుగానే వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాల్వకు పక్కలో ఎలాంటి సేఫ్టీ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా వాహనాలు కాల్వలో పడే ప్రమాదముందని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. రాత్రి వేళల్లో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనాలు నడిపినా ప్రమాదం బారిన పడే ప్రమాదముంది. కాల్వకు నీళ్లు వదిలిన సమయంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఆపి తిలకిస్తుంటారు. అధికారులు చర్యలు తీసుకుని కాల్వ వద్ద రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరముందని వాహనదారులు పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలి

కోవెలకుంట్ల: బోధనేతర యాప్‌లను తొలగించి ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణవేణి, శ్రీపతి అన్నారు. గురువారం ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మార్చి, జూన్ నెలల్లో పదో తరగతి పరీక్షల నిర్వహణలో పాల్గొన్న డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్‌వైజర్లు, ఇన్విజిలేటర్లు, పేపర్ల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రావాల్సిన పారితోషికం ఇంత వరకు విడుదల కాలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ఇప్పటి వరకు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. పీఆర్సీకి కొత్త చైర్మన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్, చంద్రపుల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఏపీయూఎస్ సభ్యత్వ నమోదు చేస్తున్న సంఘం నాయకులు

వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన గురువయ్య

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు పట్టణంలోని తెలుగుపేటకు చెందిన శేగు అంజనమ్మ పెద్ద కుమారుడు గురువయ్య(33) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. గురువయ్య భార్య గంగాంజనమ్మ నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. నివాసం ఉంటున్న ఇంటిపైన క్రిమిసంహారక మందు సేవించి అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి అంజనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డీజిల్ దొంగలు పరార్?



పోలీసులను చూసి దొంగలు వదలివెళ్లిన కారు

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపంలో కారులో వచ్చిన కొందరు వ్యక్తులు గురువారం తెల్లవారుజామున పోలీసులను చూసి పారిపోయారు. వివరాలు.. పట్టణ సమీపంలోని కర్నూలు రహదారిపై పోలీసులు గస్తీ చేపట్టారు. అనుమానాస్పదంగా కొందరు వ్యక్తులు కారులో ఉండడంతో వెంబడించారు. హెచ్ కొట్టాల గ్రామ సమీపంలోని ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయ రోడ్డులోని పొలంలో కారును వదిలివేసి అనుమానితులు పరారయ్యారు. కారులో ఖాళీ డీజిల్ క్యాన్లు ఉండడంతో డీజిల్ దొంగతనానికి వచ్చి పోలీసులను చూసి పారిపోయారా? మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు.

కూరగాయల మార్కెట్‌లో అద్దెకు రెండు బ్లాకులు



వివరాలు వెల్లడిస్తున్న మున్సిపల్ చైర్మన్

డోన్: స్థానిక పాతబస్టాండ్‌లోని కూరగాయల మార్కెట్‌లో రెండు బ్లాకులు అద్దెకు ఇవ్వనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్ తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో వివరాలు వెల్లడించారు. మార్కెట్‌లోని మొదటి అంతస్తులో రెండు బ్లాకులు (షెడ్–3) అద్దెకు ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, ఆర్ఓ వేదవతి, కౌన్సిలర్ ఆర్ట్ రమణ తదితరులు ఉన్నారు.

రోడ్డంతా గుంతలే



తిమ్మనాయినపేట చెరువు సమీపంలో ఛిద్రమైన రోడ్డు



చెన్నంపల్లెలో ప్రమాదకరంగా మారిన గుంతలు

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేట నుంచి అంకిరెడ్డిపల్లె వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారిపోయింది. ఎక్కడ చూసినా గుంతలు, కంకర తేలిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తిమ్మనాయినపేట నుంచి ఎస్.చెన్నంపల్లె, చింతలాయిపల్లె, మదనంతపురం మీదుగా అంకిరెడ్డిపల్లె వరకు ఉన్న ఈమార్గంలో నిత్యం అధిక సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో నుంచి తాడిపత్రి బస్సులు తిరుగుతుంటాయి. చాలా మంది వాహనదారులు కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు కొలిమిగుండ్ల మీదుగా కాకుండా అంకిరెడ్డిపల్లె నుంచి తిమ్మనాయినపేట మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. కొద్ది రోజుల నుంచి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రాత్రి వేళ ప్రయాణికుల బాధలు చెప్పనవసరం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈరోడ్డును నిర్మిస్తామని చెప్పినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోవడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని కనీసం గుంతలైనా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

చెకుముకి పరీక్షల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామమూర్తి, ఉపాధ్యక్షుడు అబ్దుల్ లతీఫ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థులు చెకుముకి పరీక్షలు రాయవచ్చని తెలిపారు. అక్టోబర్ 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న మండల స్థాయి, నవంబర్ 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13,14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో చెకుముకి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. రమేశ్ నాయుడు, హెచ్‌ఎంలు పద్మాబాయి, స్వర్ణలత, ప్రియాంక, పార్వతి తదితరులు పాల్గొన్నారు.